క్లుప్తంగా

11న అమ్మవారి అగ్ని గుండ ప్రవేశ మహోత్సవం

మాచర్ల: పట్టణంలో వేంచేసియున్న ఆర్యవైశ్యుల ఇలవేల్పు పాత మాచర్లలోని శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారు అగ్ని గుండ ప్రవేశ కార్యక్రమం ప్రతి ఏటా మాఘ శుద్ధ విదియ రోజున ఆర్యవైశ్య 102 గోత్రాల కన్యలచే నిర్వహిస్తారు. ఈ నెల 11న ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించటం జరుగుతుందని అధ్యక్షుడు ఆత్మకూరు పూర్ణచంద్రరావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 8గంటల నుంచి అమ్మవారికి అభిషేకం, 102 మంది ఆర్య వైశ్య కన్యలచే పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 6 గంటల నుంచి మాచర్ల పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించటం జరుగుతుందన్నారు. భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీర్వాదం, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ప్రమాదవశాత్తు కార్మికుడు మృతి



దాచేపల్లి : ప్రమాదవశాత్తు కార్మికుడు మృతిచెందిన ఘటన గురువారం జరిగింది. మండలంలోని పెదగార్లపాడు గ్రామ సమీపంలోని ఓ సిమెంట్ ఫ్యాక్టరీలో వెల్డింగ్ పనులు చేస్తున్న శివకుమార్ ఠాకూర్(56) పని ప్రదేశం నుంచి ప్రమాదవశాత్తు జారి కిందపడి మృతి చెందాడు. సీఐ ఎ.సురేంద్రబాబు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఫ్యాక్టరీలో వ్యాగన్ లోడింగ్ సెక్షన్‌లో వెల్డింగ్ పనులు చేసేందుకు బిహార్‌కి చెందిన శివకుమార్ ఠాకూర్ 40 అడుగుల ఎత్తుకి ఎక్కాడు. వెల్డింగ్ పనులు చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం పిడుగురాళ్లకు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. సిబ్బంది ఫిర్యాదు మేరకు సీఐ సురేంద్రబాబు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోస్ట్ మార్టం నిమిత్తం మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నేడు ఇళ్ల పట్టాలు పంపిణీ

దాచేపల్లి : నగర పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీలో ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ షేక్ సుభానీ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన నిరుపేదలకు ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చేతుల మీదుగా అందిస్తారని, ఇళ్ల పట్టాలు మంజూరైన లబ్ధిదారులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు ఈ కార్యక్రమానికి తరలిరావాలని కోరారు.

నేడు రెంటచింతలలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతల సచివాలయం-3 పరిధిలోని శ్రీ వెంకటేశ్వరస్వామి మాన్యం కాలనీలో నున్న ఎంపీయూపీ పాఠశాలలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి గురువారం తెలిపారు. సచివాలయ పరిధిలో వివిధ వ్యాధులతో బాధపడే వారిని ఇప్పటికే గుర్తించడం జరిగిందని వారు ఈ శిబిరంలో ఉచితంగా వైద్యసేవలు పొంది మందులు తీసుకోవచ్చన్నారు.

ఆటో దగ్ధం ఘటనలో వ్యక్తి అరెస్ట్

దాచేపల్లి : ఆటోను దగ్ధం చేసిన ఘటనలో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు సీఐ ఎ.సురేంద్రబాబు గురువారం తెలిపారు. మండలంలోని కేసానుపల్లి గ్రామంలో షేక్ రఫీకి చెందిన ఆటోను ఈ నెల 2న అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఫిర్యాది ఇచ్చిన సమాచారం మేరకు దర్యాప్తు చేసి అదే గ్రామానికి చెందిన వి.సురేష్ ఆటో దగ్ధం చేసినట్లుగా పోలీసులు గుర్తించారు. దాచేపల్లికి చెందిన ఓ వివాహిత మహిళతో ఉన్న వివాహేతర సంబంధం నేపథ్యంలో నిందితుడు ఆటోను దగ్ధం చేశాడని, ఈ ఘటనతో రాజకీయ పార్టీలకు సంబంధంలేదని సీఐ సురేంద్రబాబు చెప్పారు. కొన్ని మీడియా సంస్థలు కావాలనే ఈ ఘటనపై తప్పుడు ప్రచారాలు చేశాయని, టీడీపీకి చెందిన వ్యక్తి ఆటోను వైఎస్సార్‌సీపీ వాళ్లు దగ్ధం చేశారని అసత్యాలు ప్రచురించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనకు సంబంధించిన వాస్తవాలు ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత మీడియాపై ఉందన్నారు.

ఎలక్ట్రానిక్స్‌పై విద్యార్థులకు అవగాహన ఉండాలి

పిడుగురాళ్ల: ఎలక్ట్రానిక్స్, హార్డ్‌వేర్‌పై అవగాహన కలిగి ఉండటం ప్రతి ఒక్క విద్యార్థికి అవసరమని హెచ్‌ఎం లింగాల ధనలక్ష్మి అన్నారు. పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం పట్టణం సమీపంలోని కొండమోడులోని 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను సందర్శించటం జరిగింది. ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా విద్యార్థులకు విద్యుత్ శక్తి ప్రసారం, పంపిణీ వ్యవస్థ గురించి ఆచరణాత్మకంగా జ్ఞానం పొందటం, సబ్ స్టేషన్‌లోని సింగిల్ లైన్ రేఖా చిత్రం గురించి ఫీడర్ సర్క్యూట్ బ్రేకర్, ట్రాన్స్‌ఫార్మర్ లోడ్ బ్రేక్స్ స్విచ్‌లు, సబ్ స్టేషన్‌లో వివిధ భాగాల గురించి అసిస్టెంట్ ఇంజనీర్ శివనాగిరెడ్డి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల ముంగిటకే ప్రభుత్వ వైద్యం

- వెనుకబడిన మండలంలో గిరిజనులకు, పేదలకు అందుబాటులో వైద్యం
- రూ.2 కోట్లతో ఉప్పలపాడులో నూతన పీహెచ్‌సీ నిర్మాణం
- రూ.40 లక్షలతో శిరిగిరిపాడు పీహెచ్‌సీ అభివృద్ధి



ఉప్పలపాడులో నాడు–నేడు కింద నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం

వెల్దుర్తి: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్య రంగానికి అధిక ప్రాధాన్యతనిచ్చారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి పేద ప్రజల ఆరోగ్యం పట్ల శ్రద్ధతో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. వెనుకబడిన పల్నాటి ప్రాంతంలో పీహెచ్‌సీల నిర్మాణానికి, మరమ్మతులకు నాడు–నేడు కింద నిధులు కేటాయించారు. ఇందులో భాగంగా ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని నూతనంగా రూ.2 కోట్లతో పూర్తి చేశారు. రూ.40 లక్షలతో శిరిగిరిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మరమ్మతులు చేసి ఆధునీకరించారు. ఈ పనులు శరవేగంగా జరిగాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తీసుకెళ్లటంతో 2021లో నాడు–నేడు పనుల కింద నిధులు మంజూరు చేశారు. మాచర్ల నియోజకవర్గంలో పేద ప్రజలు, గిరిజనులు అధికంగా ఉన్న ఈ ప్రాంతంలో వైద్యశాలకు వైద్యం నిమిత్తం



మరమ్మతులు చేసిన శిరిగిరిపాడు పీహెచ్‌సీ

అధిక సంఖ్యలో రోగులు వస్తున్నారు. ప్రభుత్వం వైద్యశాలను అభివృద్ధి చేయటంతో ఎక్కడికో వెళ్లి ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించే వారు సైతం ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్నారు. ప్రతి రోజూ వందలాది మంది చికిత్స పొందటం జరుగుతుంది. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారులు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి నేరుగా రోగుల ఇంటి వద్దే వైద్యం అందిస్తున్నారు.

వైద్యం సక్రమంగా అందుతుంది..



శిరిగిరిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నాడు–నేడు కింద అభివృద్ధి చేయటం ఎంతో బాగుంది. మేము గతంలో మాచర్ల, గుంటూరు వెళ్లే వాళ్లం. ఈ రోజు ఆ పరిస్థితి లేదు. వైద్య సౌకర్యాలు బాగానే ఉన్నాయి. కొత్తగా కట్టించిన ఆసుపత్రిలో అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయి. వైద్యం సక్రమంగా అందుతుంది.

–సుజాత, స్థానికురాలు, శిరిగిరిపాడు

నూతన ఆసుపత్రి నిర్మించటం సంతోషకరం..



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు మరింతగా వైద్య సేవలందించేందుకు రూ.2 కోట్ల నిధులతో కొత్త ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మించారు. వెనుకబడిన పల్నాటి ప్రాంతంలో మెరుగైన వైద్యమందించటానికి ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి నిధులు మంజూరు చేయించటం సంతోషం.

–డి.కిరణ్, స్థానికుడు, ఉప్పలపాడు

నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నిర్మాణం అభినందనీయం..



ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెనుకబడిన పల్నాటి ప్రాంతంలో ఉండటంతో ఈ వైద్యశాలకు రోగులు అధిక సంఖ్యలో వస్తున్నారు. ఉప్పలపాడు ప్రాథమిక వైద్యశాలకు రోగుల రాక భారీగా పెరిగింది. ప్రతి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాలు నిర్వహించటంతో రోగులు ఇబ్బంది పడకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఇళ్ల వద్దే వైద్య సేవలు పొందగలుగుతున్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క పేదవారు ఉపయోగించుకోవాలి.

–శ్రీరామ్, ఉప్పలపాడు పీహెచ్‌సీ డాక్టర్

పేదలకు ఉచిత వైద్యమందించటమే లక్ష్యం..



గిరిజన దళిత వాడలు, బలహీన వర్గాల పేదలకు ఎప్పుడూ వైద్యం అందాలన్న ఉద్దేశంతో రూ.2.40 కోట్లతో నాడు–నేడు కింద ఉప్పలపాడు, శిరిగిరిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధికి సీఎం జగన్ నిధులు కేటాయించారు. ఆసుపత్రులలో సౌకర్యాలు కల్పించటం, వైద్యులు, సిబ్బందిని పెంచి పేదలకు ఉచిత వైద్యమందించిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. నాడు ప్రభుత్వ వైద్యశాల వైపు కన్నెత్తి చూడని పేదలు ఈ రోజు ప్రభుత్వాసుపత్రులలో వైద్యం చేయించుకునేందుకు బారులు తీరుతున్నారు.

–ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

అల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ

కారెంపూడి: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో 19 ఏళ్లలోపు వయస్సున్న పిల్లలందరికీ నులి పురుగుల నివారణకు అల్‌బెండజోల్ మాత్రలను ఆయా గ్రామాల వైద్య ఆరోగ్య సిబ్బందికి ఎంపీపీ బొమ్మిన సావిత్రిఅల్లయ్య చేతుల మీదుగా అధికారులు గురువారం పంపిణీ చేశారు. శుక్రవారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఈ మాత్రలను వైద్య ఆరోగ్య సిబ్బంది మండలంలో 19 ఏళ్లలోపు పిల్లలకు వీటిని వేయనున్నారు. అందుకు వీలుగా ముందుగానే అన్ని సెంటర్లకు మాత్రలను అధికారులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డి, కారెంపూడి, గాదెవారిపల్లె పీహెచ్‌సీ డాక్టర్లు ఎం.రమ్య, డాక్టర్ లక్ష్మీమౌనిక, డాక్టర్ ఎం.విజయానాయక్, డాక్టర్ లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.



అల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

ప్రజల అవసరాలపై దృష్టి పెట్టండి

ఎంపీడీవో శంకర్‌రావు

రెంటచింతల: గ్రామాలలో ప్రజల అవసరాలపై, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై గ్రామ సచివాలయ ఉద్యోగులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీవో పెదప్రోలు శంకర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని మిట్టగుడిపాడు, గోలి, జెట్టిపాలెం గ్రామ సచివాలయాలను ఆయన సందర్శించి సచివాలయ ఉద్యోగులతో మాట్లాడారు. గ్రామాలలో సచివాలయ సిబ్బంది సమష్టిగా కృషి చేసినప్పుడే గ్రామాలలో సమస్యలు పరిష్కరించడంతో పాటు ఆయా గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలలోని ప్రజలకు క్షేత్రస్థాయిలోనే మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందించేందుకు స్థానిక అధికారులతో కలిసి సచివాలయ సిబ్బంది కృషి చేయాలన్నారు.



గోలి సచివాలయంలో ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపీడీవో పి.శంకర్‌రావు

అనంతరం జెట్టిపాలెంలోని ఎంపీయూపీ పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన పథకం అమలుతీరును పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తుందని తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

భూతాప నివారణ చర్యలు చేపట్టాలి

సత్తెనపల్లి: సంపన్న దేశాలు.. పేద దేశాలకు ఆర్థిక సాయం అందజేసి, భూతాప నివారణకు చర్యలు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వి. కృష్ణయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం జరిగిన సీపీఎం పల్నాడు జిల్లా శాఖ కార్యదర్శుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశానికి పార్టీ నేత ఎస్.ఆంజనేయ నాయక్ అధ్యక్షత వహించారు. కృష్ణయ్య మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కొత్త ఉద్యోగాలు కల్పించక పోవడంతో 45 కోట్ల మంది నిరుద్యోగ సమస్యతో ఇబ్బంది పడుతున్నారన్నారు. సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త గ్రామీణ బంద్‌లో కార్మికులు, కర్షకులు, వ్యవసాయ కూలీలు, అసంఘటిత రంగ కార్మికులు పాల్గొని,



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కృష్ణయ్య

ప్రధాని మోదీ ప్రభుత్వ విధానాలపై నిరసన వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం మాజీ రాష్ట్ర కమిటీ సభ్యుడు గద్దె చలమయ్య, పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏవీఎస్ గోపాల్ రావు, అనుముల. లక్ష్మీశ్వరరెడ్డి, వై రాధాకృష్ణ, జి.రవిబాబు, కమిటీ సభ్యులు గుంటుపల్లి బాలకృష్ణ, గుంటూరు మల్లేశ్వరి, పెండ్యాల మహేష్, హనుమంతు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాతులూరులో వైభవంగా సిడిమానోత్సవం



నాదెండ్ల: మండల పరిధిలోని సాతులూరు గ్రామంలో కొలువైయున్న గ్రామ దేవతల ఆలయాల తొమ్మిదో వార్షికోత్సవం గురువారంతో ముగిసింది. గత నెల 31న ప్రారంభమైన వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా సిడి మానోత్సవం నిర్వహించారు. గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. సాంప్రదాయబద్ధంగా మేళతాళాల తో స్వామి వారిని ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాలను విద్యుత్ దీపాలంకరణ చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

నిబంధనలతో ప్రమాదాలకు అడ్డుకట్ట

సత్తెనపల్లి: ట్రాఫిక్ నియమాలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని పట్టణ సీఐ పి.ప్రభాకర్ అన్నారు. రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా పట్టణంలో గురువారం 'రహదారి భద్రత – జీవితానికి రక్షణ' అనే అంశంపై ఆటో డ్రైవర్లు, కార్ల డ్రైవర్లుతో సమావేశం నిర్వహించారు. సీఐ ప్రభాకర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు వాహందారుల్లో అవగాహన కల్పించేందుకు భద్రత వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని సూచించారు. ఈ సందర్భంగా డ్రైవర్ల సందేహాలను ఆయన నివృత్తి చేశారు సమావేశంలో పట్టణ ఎస్ఐలు ఎం. సంధ్యారాణి, ఎం.సత్యనారాయణ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

వృత్తి విద్యా కోర్సులే ఉపాధికి సోపానాలు

మాదల(ముప్పాళ్ళ): వృత్తి విద్యా కోర్సులే భవిష్యత్తుకు ఉపాధి సోపానాలు అని మాదల జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.రమేష్ అన్నారు. ఏపీ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో వృత్తి విద్య కోర్సుల్లో భాగంగా లెర్నెట్ స్కిల్స్ సహకారంతో పాఠశాల విద్యార్థులు గురువారం ఇండస్ట్రియల్ విజిట్ నిర్వహించారు. టెక్స్‌టైల్స్, టైలరింగ్ లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు వస్త్రం తయారీ ప్రక్రియలో వివిధ దశలను ప్రత్యక్షంగా చూసి, తెలుసుకున్నారు. ఫణిదం సొసైటీ అధ్యక్షుడు కేవీఎస్ దుర్గారావు వివిధ రకాల డిజైన్లను ఎలా తయారు చేస్తారో.. వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.పెరుమాళ్లు, జి.కృష్ణ, ఎ.మంగయ్య, ఎ.బాగేశ్వరి, యు.సత్యవతి, వృత్తి విద్యా శిక్షకులు వి.రామాంజనేయులు, కేడీఎల్ ప్రసాద్ పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ఏనుగుపాలెం రోడ్డులో గల చైతన్యనగర్‌లో వినుకొండ చర్చ్ ఆఫ్ క్రైస్ట్ సొసైటీ ఆధ్వర్యంలో పేద వితంతువులకు నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ సీఈవో ఎండీ రాజు మాట్లాడుతూ సొసైటీ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు వివరించారు. సభ్యులు ఎం.రమేష్‌బాబు, ఎం.ప్రవళిక, ఎస్.బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని వెల్లటూరు వాసి దుర్మరణం

వినుకొండ (నూజండ్ల): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన వినుకొండ రూరల్ చీకటీగలపాలెం అడ్డరోడ్డు వద్దనున్న పెట్రోల్ బంక్ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. బొల్లాపల్లి మండలం వెల్లటూరు గ్రామానికి చెందిన పుట్టిగంపల నాగేశ్వరరావు (48) ద్విచక్ర వాహనంపై వెల్లటూరు వెళ్లే క్రమంలో, టిప్పర్ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

నరసరావుపేట టౌన్: ప్రకాష్‌నగర్‌లో మానసికస్థితి సరీగా లేని స్వరూపారాణి అనే యువతి అదృశ్యమైనట్లు ఆ యువతి అన్న ఆనంద్ తమకు ఫిర్యాదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ కృష్ణారెడ్డి గురువారం వెల్లడించారు. ప్రకాష్ నగర్ వన్నూరుకుంట పార్కు సమీపంలో నివాసం ఉండే స్వరూపారాణి ఈనెల ఒకటో తేదిన ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదని, ఆమె ఆచూకీకోసం వెతికినా లభ్యంకాలేద న్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

ఎలుకల నివారణతో అధిక దిగుబడులు సాధ్యం

ఏవో బ్రహ్మారెడ్డి



రెంటచింతల: సామూహిక ఎలుకల నివారణ ద్వారానే అధిక దిగుబడులను సాధించవచ్చని ఏవో బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. గురువారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో వరి పంట సాగు చేస్తున్న రైతులు సామూహిక ఎలుకల నివారణ చర్యలను చేపట్టాలన్నారు. దీనిలో భాగంగా వీఏఏలు, వీహెచ్ఏల సూచనల మేరకు విషపు ఎర(మందు)ను రైతులు తయారు చేసుకోవాలని సూచించారు. రైతులందరూ ఒకే రోజు ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపట్టడం ద్వారా నష్టాన్ని తగ్గించుకోవచ్చన్నారు. వరిపైరు 4 నుంచి 6 వారాల మధ్య ఎలుక రోజుకు 100 మొక్కలను కొరికి నాశనం చేస్తుందన్నారు. ఎలుకల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా బ్రోమోడయోలిన్ మందును రాయితీపై అందజేస్తుందన్నారు. ఒక్కొక్క ఎలుక బొరియలో 10 గ్రాముల విషపు ఎరను పొట్లాలు కట్టి వేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

మాచర్ల రూరల్: ఆటో, వాహనదారులు పరిమిత సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించుకొని నిర్ణీత వేగంతో పయనిస్తే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని రూరల్ ఎస్ఐ టి.రాజశేఖర్ తెలిపారు. గురువారం మండలంలోని రాయవరం జంక్షన్ వద్ద రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ విధిగా ధరించాలని, ముఖ్యంగా ఆటో వాహనదారులు సిగ్నల్ లైట్లను, సైడు మిర్రర్‌లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రోడ్డుపై ప్రయాణించే టప్పుడు తమపై ఉన్న కుటుంబ బాధ్యతలను కచ్చితంగా గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు ఆర్ తాలూకారావు, మోషే, పోలీసు సిబ్బంది అల్లాభక్షు, రామకృష్ణ తదితరులున్నారు.



రోడ్డు భద్రతా వారోత్సవాలపై ర్యాలీ నిర్వహిస్తున్న రూరల్ ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది

వ్యాపార సంస్థలకు లైసెన్స్ తప్పనిసరి

సహాయ కార్మిక కమిషనర్ జి.ధనలక్ష్మి

పిడుగురాళ్ల: వ్యాపార సంస్థలకు లేబర్ లైసెన్స్ తప్పనిసరి అని సహాయ కార్మిక కమిషనర్, పల్నాడు జిల్లా ఇన్‌చార్జి ఆఫీసర్ జి.ధనలక్ష్మి అన్నారు. పట్టణంలోని కార్మిక శాఖ కార్యాలయంలో గురువారం వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏపీ దుకాణ సంస్థల చట్టం 1988 ప్రకారం ఫిబ్రవరి 29 2024 లోపు కార్మిక శాఖలో రిజిస్ట్రేషన్ పొందాలని, ఉన్న వారు లైసెన్సులు తీసుకోవాలని సూచించారు. ఈ నెలాఖరులోగా వ్యాపార సముదాయాలకు లైసెన్సులు తీసుకోకపోయినా, రెన్యువల్ చేయకపోయినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. కార్యక్రమంలో పిడుగురాళ్ల సహాయ కార్మిక శాఖ అధికారిణి జి.నగరాజ, వ్యాపార సంస్థల అసోసియేషన్ ప్రెసిడెంట్‌లు, ట్రెజరర్లు, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

మాచర్ల రూరల్: వ్యాపారస్తులు తమ సంస్థలకు సంబంధించిన లేబర్ లైసెన్స్‌ను తప్పనిసరిగా పొంది కార్మిక నిబంధనలను పాటించాలని పల్నాడు జిల్లా ఇన్‌చార్జి ఆఫీసర్ జి.ధనలక్ష్మి కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో వ్యాపారస్తులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వ్యాపారుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని, వ్యాపారులు తమకు సంబంధించిన లైసెన్స్‌లను రెన్యువల్ చేసుకొని కొత్త వాటికి పర్మిషన్ తీసుకోవాలన్నారు. ఈ నెలాఖరులోపు లైసెన్సు రెన్యువల్ తీసుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక సహాయ కార్యదర్శి కిలారి విష్ణు, వ్యాపార సంఘాల ప్రతినిధులు గాలేశ్వరరావు, శివరామిరెడ్డి, సాంబశివ రావు, ఆంజనేయులు, సీతారామయ్య తదితరులు ఉన్నారు.



వ్యాపారస్తులతో మాట్లాడుతున్న సహాయ కార్మిక కమిషనర్ ధనలక్ష్మి

నాలుగు గ్రామాల్లో జలజీవన్ మిషన్ పనులు

ఏఈ ఆకాష్

శావల్యాపురం: జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా మండలంలోని నాలుగు గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మూఢవత్ ఆకాష్ తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏఈ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో ఆయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు సహకారంతో జలజీవన్ మిషన్ పథకంలో అభివృద్ధి పనులు పారదర్శకంగా జరుగుతున్నాయన్నారు. మండలంలోని భాస్కర్ నగర్ గ్రామంలో రూ.83 లక్షల వ్యయంతో ఐదు కిలోమీటర్ల మేర పైపులైను, ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణ పనులతో పాటు 120 ఇంటింటి నీటి కుళాయిలు పనులు చేపట్టామన్నారు. అలాగే మండలంలోని మతుకుమల్లి గ్రామంలో రూ. ఒక కోటి 15 లక్షల వ్యయంతో గ్రామంలో 10 కిలోమీటర్ల వరకు పైపులైను పనులు 1032 ఇంటింటి నీటి కుళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు. మండలంలోని శానంపూడి గ్రామంలో రూ. 50 లక్షల వ్యయంతో గతంలో ఉన్ననటువంటి పాత మంచినీటి చెరువు మరమ్మతులు చేయించి 3 కిలోమీటర్ల వరకు పైపులైను ఇంటింటి 455 నీటికుళాయిలు పనులు జరుగుతున్నాయన్నారు. మండలంలోని చినకంచర్ల గ్రామంలో జలజీవన్ మిషన్ పథకంలో నిధులు రూ.50 లక్షల వ్యయంలో చేపట్టిన పనులు తుది దశకు చేరినట్లు త్వరలో ప్రారంభిస్తున్నట్లు ఏఈ వెల్లడించారు.

భాషా ప్రాధాన్యతతోనే బోధనలో మెరుగు

- డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సుభాని
- బోయపాలెం జిల్లా విద్యాశిక్షణ సంస్థలో స్టెప్ శిక్షణ కార్యక్రమం ప్రారంభం

యడ్లపాడు: భాష ప్రాధాన్యతను గుర్తించి భిన్న రూపాల్లో విశ్లేషిస్తూ వినియోగించేలా చేయడమే స్టెప్ శిక్షణ ముఖ్య ఉద్దేశమని ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎం సుభాని చెప్పారు. ఉమ్మడి గుంటూరు జిల్లా విద్యాశిక్షణ సంస్థలో ఆంగ్ల ప్రావీణ్యం ప్రామాణిక పరీక్షపై నాలుగు రోజులు శిక్షణ తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన పలు ప్రభుత్వ పాఠశాలల్లో బయాలజీకల్, ఫిజికల్, సోషల్, గణితం, ఆంగ్లం సబ్జెక్టుల ఉపాధ్యాయులు 40 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శిక్షణ ఆవశ్యకత, వాటి ప్రయోజనాలను ఆయన వివరించారు. ఈ శిక్షణ రెండు రోజులు ఆఫ్‌లైన్ శిక్షణ ఉంటుందని, మిగిలిన రెండు రోజులు ఆన్‌లైన్ ద్వారా అవగాహన కల్పిస్తున్న వెల్లడించారు. అనంతరం దిహిందూ గ్రూప్ సంస్థకు చెందిన ఎస్ఆర్‌పీలు భాగ్యలక్ష్మి, ప్రియదర్శిని తరగతి గదిని నిర్వహణ, విద్యార్థులను సంసిద్ధుల్ని చేయడం, బోధనలో భిన్న పద్ధతులను అవలంభించడంపై మాస్టర్ ట్రినర్స్‌కు వివరించారు. కార్యక్రమాన్ని శిక్షణ కో ఆర్డినేటర్ డాక్టర్ కె.ప్రసాద్ పర్యవేక్షించగా, డైట్ అధ్యాపకులు సహకారం అందించారు.



కార్యక్రమం గురించి వివరిస్తున్న ప్రిన్సిపాల్

రైల్లో అక్రమ మద్యం పట్టివేత

నరసరావుపేట టౌన్: రైల్లో అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ.85 వేల విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు జీఆర్‌పీ ఎస్ఐ తన్నీరు సుబ్బారావు తెలిపారు. గురువారం స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు హుబ్లీ టు విజయవాడ ఎక్స్‌ప్రెస్‌లో గురువారం తనిఖీలు చేపట్టామన్నారు. క్రోసూరు మండలం దొడ్లేరుకు చెందిన షేక్ బెల్లంకొండ ఇమ్రాన్ సూట్‌కేసులో 26 మద్యం బాటిళ్ల అక్రమంగా తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. విచారణలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన మద్యం బాటిళ్లుగా తేలిందన్నారు. అక్కడ మిలటరీ వాళ్లకు సరఫరా చేసే వాటిగా గుర్తించామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.